9
సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 18 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి నార్కో కో ఆర్డినేషన్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. పోలీసు, ఎక్సైజ్ అధికారులు తమ పరిధిలోని సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి, సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా పెట్టాలని, రాత్రి వేళ గస్తీ బృందాలతో తనిఖీలు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగ సామాజిక సమస్యగా పరిణమించినందున పాఠశాలలు, కళాశాలల్లో ఈగల్ టీమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వీటితో పాటు వసతి గృహాలను కూడా పోలీసు అధికారులు సందర్శించి, మాదకద్రవ్యాల ప్రమాదంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కీర్తి సూచించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ, గత జూన్ నుంచి ఇప్పటి వరకూ పోలీసులు, ఈగల్ టీములు సుమారు 3,500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా 93 మందిపై 23 కేసులు నమోదు చేశారన్నారు. గోకవరం, కోరుకొండ, సీతానగరం ప్రాంతాల్లో గంజాయి రవాణా ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. జిల్లాలో 22 గంజాయి హాట్‌స్పాట్‌లను గుర్తించి, ఆ ప్రాంతాల్లో నిరంతర నిఘా ఉంచి, తనిఖీలకు చర్యలు చేపట్టామన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా, వాడకంపై ప్రజలు ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, ఎక్సైజ్, రవాణా అధికారులు వెంకటేశ్వర్లు, సీహెచ్ లావణ్య, ఆర్.సురేష్, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కడలిలోకి 2.08 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 2,08,519 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీరు వదిలారు. భద్రాచలంలో 18, ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 10.40 అడుగుల నీటిమట్టం ఉంది.

కలంపై కక్షా?

- జిల్లావ్యాప్తంగా జర్నలిస్టుల నిరసనలు
- సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్
- పత్రికా స్వేచ్ఛను కాపాడాలని నినాదాలు
- అధికారులకు వినతులు
- ఏపీయూడబ్ల్యూజే, ప్రజా సంఘాలు, ప్రెస్ క్లబ్ మద్దతు



రాజమహేంద్రవరంలో అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

సాక్షి, రాజమహేంద్రవరం: కలంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాలు గళమెత్తాయి. సర్కారు మీడియా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నిరసనకు దిగాయి. నకిలీ మద్యంపై వార్తలు ప్రచురించిన 'సాక్షి' మీడియాపై కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా జర్నలిస్టు, ప్రజా సంఘాల నేతలు, ప్రతినిధులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ప్రజల స్వరాన్ని వినిపిస్తున్న పాత్రికేయ కలంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటంపై గళమెత్తారు. ప్లకార్డులు చేబూని సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇలాంటి దారుణమైన సంస్కృతికి వెంటనే స్వస్తి చెప్పాలని హితవు పలికారు. భావ ప్రకటన స్వేచ్ఛకు చంద్రబాబు ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. నకిలీ మద్యంపై వార్తలు రాస్తే 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితో పాటు, పాత్రికేయులపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు.

వార్తలు రాస్తే కేసులు పెట్టడం దారుణమని, ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవటమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని వార్తా సంస్థలనూ ఒకేలా చూడాలని హితవు పలికారు. ''నకిలీ మద్యం తాగితే మనుషులు చనిపోరా.. దీనిపై వార్తలు రాస్తే రిపోర్టర్లు, ఎడిటర్లను అక్రమ కేసులతో వేధిస్తున్నారు. నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా మార్చారని రాయడం తప్పా? నకిలీ మద్యం తప్పని రాయడం కూడా మీకు తప్పేనా? నకిలీ మద్యం మంచిదేనని ప్రభుత్వం చెబుతోందా? ఇప్పటికైనా ప్రభుత్వం 'సాక్షి'పై కక్ష సాధింపు మానుకోవాలి. తప్పుడు కేసులు ఎత్తివేయాలి.

జర్నలిస్టులు, మీడియా సంస్థలను ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం మానుకోవాలి. లేని పక్షంలో జర్నలిస్టు సంఘాలన్నీ ఏకమై పోరాడతాయి'' అని హెచ్చరించారు.



- 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు రిపోర్టర్లపై అక్రమ కేసులు పెట్టి పోలీసులు వేధించడాన్ని మండల కేంద్రమైన పెదపూడిలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. అక్రమ కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ తహసీల్దార్ పీవీ సీతాపతిరావుకు వినతిపత్రం సమర్పించారు.
- జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యాన నిడదవోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.
- గోపాలపురంలో జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.
- నియోజకవర్గ కేంద్రమైన కొవ్వూరులో జర్నలిస్టులు కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ రాణి సుస్మితకు వినతిపత్రం అందజేశారు. 'సాక్షి'పై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు జర్నలిస్టులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో...

ఏపీయూడబ్ల్యూజే, రాజమండ్రి ప్రెస్‌క్లబ్, ప్రజా సంఘాల నేతలు, జర్నలిస్టులు రాజమహేంద్రవరంలో ఆందోళన చేపట్టారు. ఎస్పీ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. నిజాలు నిర్భయంగా రాస్తున్న 'సాక్షి' పత్రికపై ప్రభుత్వం, పోలీసులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మూడు రోజులుగా సాక్షి ప్రధాన కార్యాలయంలో పోలీసులు తనిఖీలు చేస్తూ, పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని మండిపడ్డారు. అడిషనల్ ఎస్పీ ఎంబీఎన్ మురళీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మాజీ కార్యదర్శి మండెల శ్రీరామ్మూర్తి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి మాట్లాడుతూ, 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనాలకు సంబంధించి ఎడిటర్ ధనంజయ రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జిలకు పోలీసులు నోటీసులు జారీ చేయడం, పత్రికా కార్యాలయంలో హడావుడి చేయడం, ఒక వార్త రాసినందుకు విచారణ పేరుతో 170 ప్రశ్నలు సంధించడం ప్రత్యక్ష వేధింపుల కిందకే వస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తున్న 'సాక్షి'పై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసినంత మాత్రాన ఎడిటర్, సంబంధిత ఉద్యోగులపై కక్షపూరిత చర్యలు తీసుకోరాదంటూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసినా, వాటిని తుంగలో తొక్కుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీవీ స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాస్, సాక్షి టీవీ స్టాఫ్ రిపోర్టర్ హరీష్, సాక్షి పత్రిక స్టాఫ్ రిపోర్టర్ ఫయాజ్ బాషా, జర్నలిస్టులు విశ్వనాథ్, సత్యంబాబు, పీఎస్ గంగాధర్, సత్యనారాయణ, దానవాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు భావ్యం కాదు



వార్తలు రాసే మీడియా సంస్థలపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం భావ్యం కాదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాశారన్న కారణంతో 'సాక్షి' ఎడిటర్, రిపోర్టర్లపై కేసులు బనాయించి వేధించడం తగదు. వార్తల్లో తప్పు ఉంటే రిజాయిండర్ ఇవ్వాలే తప్ప ఇలాంటి చర్యలు తగవు. ప్రభుత్వం పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి.

– మండెల శ్రీరామ్మూర్తి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మాజీ కార్యదర్శి

పత్రికా స్వేచ్ఛను హరించడమే



పత్రికా స్వేచ్ఛను హరించడం ప్రభుత్వానికి తగదు. వాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకుండా పత్రికలను నియంత్రించడం మంచి పరిణామం కాదు. వార్తలు రాసే విషయంలో పత్రికలకు స్వేచ్ఛ ఇవ్వాలి. ఈ విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదు. ఇలాంటి చర్యలను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలి.

– కుడుపూడి పార్థసారథి, రాజమండ్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే..



'సాక్షి'పై అక్రమ కేసులు బనాయించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అవుతుంది. సమస్యలపై ప్రజలను చైతన్యపరుస్తున్న మీడియాపై ప్రభుత్వాలు కక్ష కట్టడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. సాక్షి పత్రిక, ఎడిటర్, రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి. కేసులు ఉపసంహరించుకునేంత వరకూ ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటారు.

– గెద్దం రవీంద్రబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి, కుల నిర్మూలన పోరాట సమితి, సమిశ్రగూడెం, నిడదవోలు మండలం

'సాక్షి'పై దాడులు ఆపాలి



'సాక్షి' మీడియాపై పోలీసు దాడులను తక్షణం ఆపాలి. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉన్న మీడియాకు సంకెళ్లు వేయడం మంచిది కాదు. 'సాక్షి' కార్యాలయాల్లో సోదాలు చేయడం, ఎడిటర్, బ్యూరో ఇన్‌చార్జిలకు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. పత్రికా స్వేచ్ఛను, భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడం రాజ్యాంగం విరుద్ధం.

– షేక్ మస్తాన్, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

వర్మను జీరో చేసేశాం

- జనసేన పిలిస్తేనే వెళ్లాలి, మాట్లాడాలన్నాం
- నువ్వేమైనా కోవర్టా అని వర్మను సీఎమ్మే అన్నారు
- సూపర్‌సిక్స్ సక్సెస్ కార్యక్రమం చేయొద్దన్నారు
- కాకినాడ ఇన్‌చార్జి మంత్రి నారాయణ వ్యాఖ్యలతో కలకలం
- తానేం జీరోను కానంటున్న వర్మ
- పిఠాపురంలో అన్నింటికీ చెడ్డ మాజీ ఎమ్మెల్యే
- వారందరూ ఒక్కటయ్యారన్న అనుమానం
- అంతర్మథనంలో టీడీపీ క్యాడర్



పిఠాపురంలో వర్మను జీరో చేసేశాం. నాలుగు నెలల కిందట సీఎం పిలిపించమన్నారు. నువ్విక ఏ స్టేట్‌మెంట్లూ ఇవ్వొద్దు. జనసేన వాళ్లు పిలిస్తే వెళ్లాలి. మాట్లాడమంటే మాట్లాడాలి. అలా లేదు, కాదంటే పార్టీలో నిన్ను కోవర్టు అనుకోవాల్సి ఉంటుందని సీఎమ్మే అన్నారు.

– పి.నారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి



ఎవరో అంటేనో, ఎవరో చెబితేనో నేను జీరోను కాను. నేనేంటో నాకు, నియోజకవర్గంలో నా కార్యకర్తలకు తెలుసు. నన్ను ఎవరూ పిలిచి మాట్లాడలేదు. నాకేమీ చెప్పలేదు. పార్టీ కోసం నా మార్గంలో నేను వెళతాను. కార్యక్రమాలు కొనసాగిస్తూంటాను.

– ఎస్వీఎస్ఎన్ వర్మ, మాజీ ఎమ్మెల్యే, పిఠాపురం

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఎవరు అవునన్నా, కాదన్నా తమ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే వర్మ పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా తయారైందన్నది పిఠాపురంలోని టీడీపీ ముఖ్య నాయకులు, సీనియర్ కార్యకర్తల మాట. ఎన్నికలకు ముందు, తరువాత వర్మ రాజకీయ పరిస్థితిని బేరీజు వేసుకున్న ఎవరికైనా ఈ విషయం ఇట్టే అవగతమవుతుంది. పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్ కల్యాణ్ గెలుపొందడం, ఉప ముఖ్యమంత్రి కావడంతోనే వర్మ రాజకీయం ప్రశ్నార్థకంగా మారింది. డిప్యూటీ సీఎం సోదరుడు, జనసేన నాయకుడైన నాగబాబు పిఠాపురంలో జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో మాట్లాడిన మాటలే వర్మ భవిష్యత్తును తేల్చేసేవిగా స్పష్టమయ్యాయి. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా పవన్‌కు పిఠాపురం కేటాయించినప్పుడు తొలి ఎమ్మెల్సీ పదవి నీకేనని వర్మకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు గట్టి హామీ ఇచ్చారనే విస్తృత ప్రచారం జరిగింది. ఆ తరువాత ఎమ్మెల్సీ ఊసెక్కడా రాలేదు. ఇదే విషయాన్ని వర్మ అనుచర టీడీపీ నాయకులు గుర్తు చేస్తూండటం గమనార్హం.

నారాయణ మాటల వెనుక మర్మమిదే..

ఇటీవల నెల్లూరు నగర టీడీపీ నాయకులు బహిరంగ విమర్శలు చేసిన నేపథ్యంలో మంత్రి పి.నారాయణ ఆ ప్రాంత నాయకులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పార్టీ నుంచి స్పష్టమైన ఆదేశాలు, సూచనలు లేకుండా నాయకులు ఎవరూ ఏమీ మాట్లాడకూడదని, అలా ఎవరైనా మాట్లాడితే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరిస్తూ పిఠాపురం నియోజకవర్గం ప్రస్తావన తీసుకొచ్చారు. ఆయన మాటల్లోనే.. ''ఎన్డీఏ గవర్నమెంట్ మూడు పార్టీల కూటమితో కలిపి ఏర్పడింది. ప్రతి ఒక్కరూ చాలా చాలా జాగ్రత్తగా ఉండాలి. నేను కాకినాడ ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నా. పిఠాపురంలో పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేగా గెలిచారు. అక్కడ మన పార్టీ వారికి, జనసేనకు రోజూ గొడవలే. నా పని అక్కడ గొడవలను సర్దడమే. వర్మ వెరీ ఫెరోషియస్. ఆయనకు పార్టీ టికెట్ ఇవ్వకుంటే ఒకసారి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచారు. స్టేట్‌మెంట్లు ఇస్తూంటే మూడు నాలుగు నెలల కిందట అతన్ని పిలిచి జీరో చేసేశాం. 'సర్, నన్ను జీరో చేసేశా'రని వర్మనే నాతో అంటూంటారు. తప్పదు. ఎన్డీఏ కలసి ఉన్నప్పుడు పిఠాపురంలో మీరేం స్టేట్‌మెంట్లు ఇవ్వవద్దన్నాం. జనసేన వాళ్లు పిలిచి డయాస్‌పై మాట్లాడమంటే మాట్లాడండి. స్టేట్‌మెంట్లు ఇవ్వమంటే ఇవ్వండి. మీరేం మాట్లాడొద్దన్నాం. సీఎం గారు వర్మను పిలవమంటే పిలిపించాను. నా ఎదుటే సర్ వర్మతో మాట్లాడారు. ఇవాళ నుంచి నువ్వు మాట్లాడొద్దు. అలా కాదు, లేదంటే నువ్వేమైనా పార్టీ కోవర్ట్‌వా అనుకోవాల్సి వస్తుంది. సూపర్‌సిక్స్ సదస్సు కూడా వర్మను చేయవద్దన్నారు. నన్ను వెళ్లి చేయమన్నారు. నేనే వెళ్లి చేసి వచ్చా..'' అని ముక్తాయించారు. ఇప్పుడు ఈ ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీనిపై టీడీపీ నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ముఖ్యంగా వర్మ అనుచరులు ఆగ్రహోదగ్రులు అవుతున్నారు. నారాయణ మాటలను బట్టి, జరుగుతున్న పరిణామాలను బేరీజు వేసుకుంటే మన నాయకుడు జీరో అయినట్లే కదా అని ఓవైపు చెవులు కొరుక్కుంటూనే ఇప్పుడేం చేద్దామనే సమాలోచనలు చేసుకుంటున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు ఒకరు 'సాక్షి'తో అనడం గమనార్హం. 'పిఠాపురంలో టీడీపీని క్రమంగా నిర్వీర్యం చేస్తున్నది వాస్తవం. అధిష్టానం నియోజకవర్గాన్ని వదిలేసుకున్నదనేది కూడా అంతే నిజం' అని ఆయన వాపోయారు.



బింకాలు పోతున్న వర్మ

వైరల్ అవుతున్న నారాయణ ఆడియోలోని అంశాలను తాజాగా వర్మ వద్ద మీడియా ప్రస్తావించగా తాను జీరో కానని చెప్పుకోవాల్సి వచ్చింది. తనేంటో, తన రాజకీయ పరిస్థితులు ఏంటో నియోజకవర్గ ప్రజలకు తెలుసని చెప్పుకొచ్చినప్పటికీ.. ప్రస్తుతం ఆయన పరిస్థితి అగమ్యగోచరంగానే తయారైంది. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన తొలి ఎమ్మెల్సీ అనే హామీ అటకెక్కింది. మనం ఎవరి మాటలూ వినక్కర్లేదు, పట్టించుకోవాల్సిన పని లేదన్న నాగబాబు మాటలను బట్టి నియోజకవర్గంలో జనసేనకే ప్రాధాన్యం తప్పక్కిన వారికేమీ లేదని తేలిపోయింది. అందువల్లనే అప్పటి నుంచీ ఎవరి కుంపటి వారిదన్నట్లు అయిపోయింది. జనసేన, టీడీపీ కార్యక్రమాలు వేర్వేరుగానే కొనసాగుతున్నాయి. వర్మను రానీయవద్దని జనసేన నాయకులు బాహాటంగానే అంటున్నది తెలియనిదేమీ కాదు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఎవరైనా అధికారులు పిలిస్తే సరి! లేదంటే జనసేన నుంచి వర్మకు పిలుపు ఉండటం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్‌లు, ఆలయ కమిటీలు, కార్పొరేషన్ల వంటి వాటిల్లో వర్మ అనుయాయులకు పదవులు దక్కిన దాఖలాల్లేవు.

వారంతా ఒక్కటయ్యారా!

ఏదో సినిమాలో.. మీది తెనాలే, మాది తెనాలే అన్నట్లు.. జనసేన ముఖ్య నాయకులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ ఒక్కటైపోయారా అనే అనుమానాలను సైతం టీడీపీ సీనియర్లు వ్యక్తం చేస్తున్నారు. లేదంటే నెల్లూరు నాయకులతో జరిగిన కాన్ఫరెన్స్‌లో 'వర్మ జీరో అయ్యారు. జీరోను చేసేశాం' అని టీడీపీకి చెందిన మంత్రి అనడమేమిటని సందేహిస్తున్నారు. పైగా తమ పార్టీ అధినేత చంద్రబాబు 'నిన్ను కోవర్టు అనుకోవాలా?' అని వర్మనుద్దేశించి ఎందుకంటారనే చర్చలు టీడీపీలో అంతర్గతంగా జరుగుతూండటం పరిశీలనాంశం.

నష్ట నివారణలో నేతలు

నారాయణ వ్యాఖ్యలు పిఠాపురం టీడీపీలో తీవ్ర దుమారం లేపడంతో నేతలు నష్టనివారణ చర్యలకు దిగారు. అధిష్టానం తలంటడంతో వర్మను నారాయణ విశాఖకు పిలిపించుకుని మాట్లాడారు. వర్మనుద్దేశించి తానలా అనలేదని, ఆ ఆడియో కట్ అండ్ పేస్ట్‌లా ఉందని నారాయణ వివరణ ఇచ్చుకోగా, తాను ఇలాంటి వాటిని పట్టించుకోనని వర్మ అభిప్రాయపడ్డారు.

క్లుప్తంగా

సాంబార్‌లో పడిన వ్యక్తి మృతి


సునీల్‌కుమార్ (ఫైల్)

కాకినాడ క్రైం: ఓ వివాహ వేడుకకు వెళ్లి ప్రమాదవశాత్తూ సాంబార్‌లో పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ వివరాల్లోకి వెళితే.. భీమవరం గునిపూడి ప్రాంతం అంబేడ్కర్ కాలనీకి చెందిన కటికల సునీల్‌కుమార్ (27) ఈ నెల 12న అదే ప్రాంతంలో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ భోజనాలకు సిద్ధం చేసిన భారీ సాంబార్ బాణీలో పడిపోయాడు. అప్పుడే వండిన సాంబార్ వేడిగా ఉండడంతో దేహం కాలిపోయి తీవ్రగాయాల పాలయ్యాడు. సునీల్ కుమార్‌ను అక్కడి వారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. నాలుగు రోజులుగా బర్న్స్ వార్డులో చికిత్స కొనసాగుతుండగా అతను శుక్రవారం మధ్యాహ్నం ప్రాణాలు కోల్పోయాడు. సునీల్ కుమార్ నాలుగేళ్ల క్రితం తాను నివసిస్తున్న ప్రాంతానికే చెందిన నీలమను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు మూడేళ్ల కుమారుడు షాలేం రాజు ఉన్నాడు. కూలి పనులు చేసుకుంటూ భార్య, కుమారుడిని పోషించుకుంటున్న సునీల్ కుమార్ ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

వ్యక్తి దుర్మరణం

శంఖవరం: కత్తిపూడి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అన్నవరం పోలీసుల కథనం ప్రకారం.. సీతంపేట గ్రామానికి చెందిన బోడ రాంబాబు (65) కత్తిపూడిలో ఆసుపత్రికి వచ్చాడు. అక్కడ పెట్రోల్ బంక్ వద్ద హైవే దాటుతుండగా, తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.హరిబాబు తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఇద్దరు విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): క్వాంటమ్ ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్స్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ ఈ వివరాలు తెలిపారు. మొత్తం 38 మంది విద్యార్థులు, 19 మంది ఉపాధ్యాయులు జిల్లా స్థాయి సెమినార్‌లో పాల్గొన్నారన్నారు. వీరిలో పి.కార్తికేయ వరప్రసాద్‌రెడ్డి (కుతుకులూరు జెడ్పీ హైస్కూల్), వీఎస్ఎస్ విఘ్నేష్ (ఉండ్రాజవరం జెడ్పీ హైస్కూల్) రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారని వివరించారు. వీరు ఈ నెల 18న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సెమినార్‌లో పాల్గొంటారన్నారు. విజేతలను జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు, సీఎంఓ శ్రీనివాసరావు, ఇతర విద్యాశాఖాధికారులు అభినందించారు.

అంతా చూసి.. ఆరా తీసి

- రాయవరంలో బాణసంచా పేలుడుపై పరిశీలన
- ఘటనా స్థలాన్ని సందర్శించిన ద్విసభ్య కమిటీ
- బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు డిమాండ్


సంఘటనా స్థలంలో విచారణ చేస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు

రాయవరం: కోనసీమ జిల్లాను కుదిపేసిన రాయవరం బాణసంచా పేలుడు ఘటనపై ద్విసభ్య కమిటీ సభ్యులు ఆరా తీశారు.. ఘటనా స్థలాన్ని సందర్శించి, నిబంధనల అమలును పరిశీలించారు.. ఈ నెల 8న రాయవరంలోని గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో బాణసంచా ప్రమాదం జరగ్గా, ఆ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ద్విసభ్య కమిటీ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఇందులో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ పీడీ రామకృష్ణలు ఉన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల, ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డీఓ అఖిల, డీఎస్పీ బి.రఘువీర్‌లు ద్విసభ్య కమిటీకి ప్రమాదం జరిగిన తీరును వివరించారు. అక్కడ పరిశీలించిన సభ్యులు బాణసంచా యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి (సత్తిబాబు) చిన్న కుమారుడు చిట్టిబాబును కూడా విచారణ చేశారు. ప్రమాదం జరిగిన గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ సమీపంలోని భవానీ గ్రాండ్ ఫైర్ వర్క్స్‌ను చూసిన ద్విసభ్య కమిటీ అక్కడ తీసుకున్న భద్రతా చర్యలను పరిశీలించింది. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని, ప్రమాద ఘటనపై జిల్లా అధికారులతో సమీక్షించింది.

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

ఎంపీడీఓ కార్యాలయం వద్ద ద్విసభ్య కమిటీని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కలిశారు. ప్రమాదంలో మృతి చెందిన యజమానిని మినహాయిస్తే, చనిపోయిన తొమ్మిది మంది కూలీలు నిరు పేదలేనని కమిటీ దృష్టికి తీసుకు వెళ్లారు. వారివి రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలని, ఘటన జరిగి పది రోజులవుతున్నా నేటికీ ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందలేదన్నారు. పేద కుటుంబాలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన రోజు రాష్ట్ర మంత్రులు సందర్శించినా, నేటికీ సాయం అందలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడాలని అన్నారు. ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన కూలీలకు కనీస న్యాయం చేయని ప్రభుత్వాన్ని ఏమనాలో అర్థం కావడం లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విశాఖపట్నం జిల్లా పరవాడ ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్పందించిన తీరును ఎమ్మెల్సీ ఉదాహరించారు. ప్రమాదం జరిగిన వెంటనే 24 గంటలు తిరక్కుండానే ఒక్కో బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించిన ఘనత గత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ వెంట సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సిరిపురపు శ్రీనివాసరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వెలగల సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.


బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ద్విసభ్య కమిటీకి వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


న్యాయం చేయాలని నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

ప్రభుత్వానికి నివేదిస్తాం..

ప్రమాదం ఏ విధంగా జరిగిందీ.. బాధిత కుటుంబాల పరిస్థితి.. వారిని ఏ విధంగా ఆదుకోవాలనే అంశాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ద్విసభ్య కమిటీ సభ్యుడు ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ బాణసంచా తయారీ కేంద్రానికి అన్ని అనుమతులు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. పోలీస్, రెవెన్యూ, ఫైర్, కార్మిక తదితర సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడామన్నారు. ప్రమాదంలో పది మంది చనిపోగా, ముగ్గురు బయట పడినట్లు తెలిపారు. ఫోరెన్సిక్ రిపోర్టు వచ్చిన తర్వాత ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలిసే అవకాశం ఉందన్నారు. అన్ని వివరాలతో కూడిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

న్యాయం చేయాలంటూ..

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ప్రజా సంఘాల నేతలు నినాదాలు చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్దకు మృతుల కుటుంబాలకు చెందిన బంధువులు, ప్రజా సంఘాలు వచ్చి ఆందోళన చేశారు. కమిషనర్ బయటకు రావాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. రాయవరం సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత ధూళి జయరాజు, రైతు కూలీ సంఘ నేత వెంటపల్లి భీమశంకరం, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు కోన లాజర్ తదితరులు బాధిత కుటుంబాల తరఫున ద్విసభ్య కమిటీ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉంటే బాధిత కుటుంబాలను ఆదుకోవాలని మండపేట వేగుళ్ల జోగేశ్వరరావు కమిటీ సభ్యులకు వినతిపత్రం అందించారు.

అక్రమ బాణసంచా తయారీ నిందితుల అరెస్ట్


చాగల్లులో బాణసంచా తయారు చేస్తున్న నిందితులతో పోలీస్, రెవెన్యూ అధికారులు

చాగల్లు: అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచాను తయారు చేస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు రాజమహేంద్రవరం నార్త్ జోన్ ఏసీపీ, కొవ్వూరు ఇన్‌చార్జి డీఎస్పీ వై.శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చాగల్లు శివారులోని మట్టా శివనారాయణ జీడిమామిడి తోటలో అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్న ఊనగట్లకు చెందిన ఆత్కూరి గోపాలకృష్ణ, మట్టా శివనారాయణ, దొనక మురళి, పల్లెల రవికుమార్, కోకనాటి సూరిబాబులను అరెస్ట్ చేశామన్నారు. బాణసంచా తయారీ సామగ్రితోపాటు పాటు రెండు వ్యాన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. ఈ దాడుల్లో కొవ్వూరు రూరల్ సీఐ విజయ్‌బాబు, చాగల్లు ఎస్సై కె.నరేంద్ర, తహసీల్దార్ ఎం.మెరికమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన ట్రైనీ ఎస్సై


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన భానుప్రకాష్‌ను రక్షించిన ట్రైనీ ఎస్సై గణేష్, కానిస్టేబుల్ విజయ్

గోపాలపురం: చెరువులో పడి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన యువకుడిని పోలీసులు కాపాడిన ఘటన గోపాలపురం మండలం చెరుకుమిల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఆ వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన పురిటిగడ్డ భానుప్రకాష్ అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సెలవుల్లో స్వగ్రామానికి వచ్చాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురై చెరువులోకి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడుతున్నట్లు తన వాట్సాప్ స్టేటస్‌లో పోస్టు చేశాడు. దానిని చూసిన ఓ మిత్రుడు అనంతపురం నుంచి 112 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఈ సమాచారం అందుకున్న గోపాలపురం ట్రైనీ ఎస్సై పి.శివగణేష్, తనతో పాటు విజయ్ అనే కానిస్టేబుల్‌ను తీసుకుని సంఘటనా స్థలానికి మూడు నిమిషాల్లో చేరుకుని, చెరువులో మునిగిపోతున్న భానుప్రకాష్‌ను కాపాడారు. భానుప్రకాష్ తల్లిదండ్రులు, బంధువులు, అతని స్నేహితులు, గ్రామస్తులు ట్రైనీ ఎస్సైను అభినందించారు.

విశ్వశాంతిని కాంక్షిస్తూ శాంతి కల్యాణం


పవిత్రోత్సవాల్లో భాగంగా శాంతి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి సన్నిధిలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన పవిత్రోత్సవాలు శుక్రవారంతో సంపూర్ణమయ్యాయి. మూడో రోజు స్వామివారికి, ఉభయ దేవేరులకు అలంకరించిన పవిత్రాలను తీసుకు వచ్చి చక్ర పెరుమాళ్లకు సమర్పించారు. చతుస్థానార్చనలతో ఉత్సవాలను ప్రారంభించి శ్రీపుష్పయాగంతో ముగించారు. 108 కలశాలతో స్వామి, అమ్మవార్లకు శత కలశ స్నపన తిరు మంజన సేవ ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజాదికాల్లో పాల్గొన్నారు. అనంతరం లోక కల్యాణం కోరుతూ శ్రీవారి శాంతి కల్యాణం కనుల పండువగా జరిపించారు. శ్రీపుష్ప యాగం, మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాద గోష్ఠి, ఋత్విక్ సన్మానంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో గుడివాడకు చెందిన త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి శిష్య బృందం చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అన్నవరం: ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అన్నవరం పోలీసుల వివరాల ప్రకారం.. చేపల కోసం ఒడిశాలోని రాయగడ నుంచి కోనసీమ జిల్లా తాళ్లరేవు వెళ్తున్న బొలెరో వాహనం శుక్రవారం తెల్లవారు జామున అన్నవరం రహదారిపై సత్యదేవుని నమూనా ఆలయం వద్ద ఆగిన లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం క్లీనర్ కార్తిక్ (19) అక్కడికక్కడే మృతి చెందాడు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పెంపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): డిసెంబర్ 7న జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొందవచ్చన్నారు. దరఖాస్తు గడువును ఈ నెల 25 వరకూ పొడిగించారన్నారు. 27వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని, తర్వాత గడువు పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

ఒకరి మృతి, మరొకరికి గాయాలు


పోతవరం శివారులో ప్రమాద ఘటనా ప్రాంతం

నల్లజర్ల: పోతవరం శివారులో శుక్రవారం ఉదయం ఓ బైక్‌ను ట్రక్కు ఆటో ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న బల్వేంద్రసింగ్ (28) అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బల్వేంద్రసింగ్ ఆరు నెలల క్రితం కొయ్యలగూడెం మండలం కనకాద్రిగూడెంలో మారుతి కోళ్లఫారంలో పనికి చేరాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం సెలవు కావడంతో బైక్‌పై కూరగాయలు తేవడానికి పోతవరం వెళ్తుండగా నల్లజర్ల నుంచి కొయ్యలగూడెం వెళ్తున్న ట్రక్కు ఆటో ఢీకొంది. ఏఎస్ఐ శోభనాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరపాలక సంస్థకు జాతీయ స్థాయి గుర్తింపు


రాహుల్ మీనా

రాజమహేంద్రవరం సిటీ: నీటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలకు గానూ రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ దేశంలో నాలుగో స్థానం కైవసం చేసుకుంది. తద్వారా నగరానికి మరోసారి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని కమిషనర్ రాహుల్ మీనా శుక్రవారం తెలిపారు. 2024–25 సంవత్సరానికి గాను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ జల్ సంచాయ్ జన్ భాగీదారీ (జేఎస్‌జేబీ) 1.0 ర్యాంకింగ్స్ ప్రకటించింది. ఈ జాబితాలో రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్) మొదటి, హైదరాబాద్ రెండు, గోరఖ్‌పూర్ (ఉత్తర ప్రదేశ్) మూడు స్థానాల్లో నిలిచాయని కమిషనర్ తెలిపారు. ఈ అవార్డును నవంబర్ 18న అందుకోనున్నామన్నారు. ఈ పురస్కారం ద్వారా నగర పాలక సంస్థకు రూ.2 కోట్ల నగదు కూడా అందనుందన్నారు. నగరంలో 13,298 నీటి సంరక్షణ పనులు చేపట్టిన అధికారులు ఆయా ఫొటోలను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారని, వాటిని పరిశీలించిన కేంద్రం నగరానికి ప్రత్యేక బృందాన్ని పంపించిందని చెప్పారు. గత జూన్‌లో ఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ నీటి కమిషన్ సభ్యులు నగరంలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, కంబాల చెరువు, ప్రభుత్వ కార్యాలయాలు, వార్డు సచివాలయాల్లోని ఇంకుడు గుంతలను పరిశీలించారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడం, నీటి పొదుపు, పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ తదితర అంశాలపై ఈ బృందం కేంద్రానికి నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో నగర పాలక సంస్థకు ఈ అవార్డు వరించిందని కమిషనర్ తెలిపారు. ఈ ఘనత సాధించడంలో కీలక పాత్ర పోషించిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

టీడీపీ నేతలపై చట్టపరమైన చర్యలు

- అక్రమ లిక్కర్ వ్యవహారంలో ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలి
- నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబుపై చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ డిమాండ్
- ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన


ఏఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అక్రమ లిక్కర్ వ్యాపారానికి తెర తీసిన రాజమహేంద్రవరం నగర టీడీపీ నేతలపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతో కలసి జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన ఆందోళన నిర్వహించారు. అనంతరం అదనపు ఎస్పీ ఎంబీఎన్ మురళీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ, నగరంలో టీడీపీ నేతల ఆధ్వర్యాన అక్రమ మద్యం ఏరులై పారుతోందని ఆరోపించారు. అక్రమ మద్యం వ్యాపారాన్ని రెగ్యులరైజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో టీడీపీ ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలన్నారు. మద్యం వ్యాపారులతో ఫోనులో మాట్లాడిన నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబుపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏయే బ్రాండ్లకు ఎంతెంత వసూలు చేయాలో నిర్ణయించుకుంటున్నారని, ఆ బ్రాండ్లు ఏమిటో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. అక్రమ మద్యం వ్యాపారాన్ని లిమిటెడ్ కంపెనీగా మార్చేస్తున్నారని దుయ్యబట్టారు. అక్రమాలకు బైలా రాసుకోవాలని అనుకోవడం దారుణమన్నారు. నకిలీ మద్యం తాగి జీఎస్ఎల్ ఆసుపత్రిలో ముగ్గురు యువకులు మృతి చెందారని, అందుకే నగరంలో నకిలీ మద్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు. ఎక్సైజ్ అధికారులకు ఎన్ని కేసులు ఇవ్వాలో కూడా టీడీపీ నేతల ఆధ్వర్యంలోని సిండికేట్ నిర్ణయించడం చూస్తుంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో ఇట్టే తేటతెల్లమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారుల ప్రమేయంపై కూడా విచారణ చేయాలని భరత్‌రామ్ డిమాండ్ చేశారు.


ఎస్పీ కార్యాలయం వద్ద బైఠాయించిన వైఎస్సార్ సీపీ నాయకులు

ఆ వాయిస్ ఫేక్

టీడీపీ నేత మజ్జి రాంబాబు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మద్యం వ్యాపారులతో మాట్లాడినట్లుగా వైరల్ అవుతున్న వాయిస్ తనది కాదని, అది ఫేక్ అని నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు స్పష్టం చేశారు. ఈ మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో నకిలీ వీడియోలు, వాయిస్‌లు సృష్టిస్తున్నట్లు చూస్తున్నామని, ఇది కూడా అలాంటిదేనని అన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. స్థానిక పాత సోమాలమ్మ పుంత రోడ్డులోని శ్రీకన్య ఇన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయంపై దర్యాప్తు చేస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. మద్యం వ్యాపారులతో తాను మీటింగ్ పెట్టినట్లు నిరూపించాలని సవాల్ చేశారు. తనకు లిక్కర్ షాపులు లేవని, మద్యం వ్యాపారులతో మాట్లాడాల్సిన అవసరం లేదని రాంబాబు తెలిపారు.

4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం


ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతం యంత్రాలను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ కీర్తి

నిడదవోలు రూరల్: జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ఖరీఫ్ ధాన్యం సేకరణకు చర్యలు తీసుకున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం డి.ముప్పవరం పీఏసీఎస్ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ధాన్యానికి మద్దతు ధర రూ.69 అధికంగా ఇస్తామని చెప్పారు. కౌలు రైతులకు ఈ ఏడాది ప్రత్యేకంగా యూనిక్ నంబర్‌తో కార్డులు అందిస్తామన్నారు. అనంతరం ధాన్యం జల్లెడ, ధాన్యం నాణ్యత, గోనె సంచులు, తేమ శాతం కొలిచే యంత్రాన్ని, డిజిటల్ తూనిక యంత్రాలను మంత్రి దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్, కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్


వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ శ్రీకాంత్, వెనుక ముసుగుల్లో నిందితులు

రాజానగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి పాలచర్ల శివారులో టిప్పర్ చోరీ చేసిన అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకున్నట్లు నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. ఆ వివరాలను శుక్రవారం స్థానిక మీడియాకు తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ నడుపుతున్న మన్యం గణేశ్వర్రావు గత నెల 24న వ్యక్తిగత పనిపై హైదరాబాద్‌కు వెళ్తూ తనకున్న నాలుగు టిప్పర్లను తన స్నేహితుడైన అబ్బిరెడ్డి నాగేశ్వర్రావుకు చెప్పి అతని ఏఎస్ఆర్ లారీ కాటాకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేశాడు. గత నెల 25న రాత్రి వాటిలో సుమారు రూ. 42 లక్షల ఖరీదైన ఒక టిప్పర్ చోరీకి గురైంది. దీంతో అబ్బిరెడ్డి నాగేశ్వర్రావు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తును సీసీ కెమేరాల సాయంతో విస్తృతం చేసిన పోలీసులకు నిందితులు కొవ్వూరు మండలం దొమ్మేరు సమీపంలో టిప్పర్‌తో సహా దొరికిపోయారు. ఇందులో రాజస్థాన్ రాష్ట్రంలోని ధహోటగావ్‌కు చెందిన షౌకత్ ఖాన్ (38), శేర్పూర్‌గావ్‌కు చెందిన జామాల్‌ఖాన్ (35), సోహిల్ (19)లతోపాటు హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఫసీఉద్దీన్‌ఖాన్ (41) ఉన్నారు. సమావేశంలో సీఐ వీరయ్యగౌడ్, ఎస్సైలు ప్రియకుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఆలమూరు: మండలంలోని మడికిలో తన ఇద్దరు చిన్నారులను చంపి పావులూరి కామరాజు ఆత్మహత్య చేసుకోగా, ఆ కేసుకు సంబంధించి ముగ్గురిపై కేసు నమోదైంది. ఆలమూరు ఎస్సై జి.నరేష్ కథనం ప్రకారం.. ఈ నెల 15న మడికి గ్రామంలోని చిలకలపాడులో కామరాజు మృతికి ముందు రూపొందించిన సెల్ఫీ వీడియోలో సమీప బంధువులైన పావులూరి దుర్గారావు, కొరుప్రోలు తలుపులు, కొరుప్రోలు శ్రీనివాసరావు వల్లే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని పేర్కొన్నాడు. ఆ నిందితులు ముగ్గురిపై ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.